క్లుప్తంగా

సేవలు ప్రశంసనీయం



రామచంద్రారెడ్డి దంపతులను సన్మానిస్తున్న పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వేంపల్లె : హెడ్మాస్టర్ కల్లూరు రామచంద్రారెడ్డి సేవలు ప్రశంసనీయమని ఎంఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం చక్రాయపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామచంద్రారెడ్డి పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. దంపతులను పాఠశాల ఉపాధ్యాయులు, పలు సంఘాల నాయకులు, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో శ్రేష్ఠమైనదని, విద్యార్థులకు పునాది లాంటిదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ నాగేంద్రకుమార్, ప్రిన్సిపాల్స్ షేక్ రంతుబాషా, రాధాకృష్ణయ్య, హెచ్‌ఎంలు శివమునెమ్మ, సూర్యనాగమునిరెడ్డి, నాగాంజనేయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మాజీ సీఎం, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. మహానేత వైఎస్సార్ ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారని, అభిమానులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారన్నారు. రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పల్గొని రక్తదానం చేసిన మండలస్థాయి నాయకులకు, యువతకు, విద్యార్థులకు, ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జ్వరాల సర్వే జాగ్రత్తగా చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియ అధికారిణి మనోరమ

ఎర్రగుంట్ల : జ్వరాల సర్వేని సిబ్బంది జాగ్రత్తగా చేయాలని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ తెలిపారు. బుధవారం స్థానిక ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి రోజు వారికి కేటాయించిన ఏరియాలలో సిబ్బంది తప్పకుండా విజిట్‌కు వెళ్లాన్నారు. కార్యక్రమంలో అర్బన్ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఓబులేసు, ఎపీహెచ్‌ఈఓ శంకర్‌రెడ్డి, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

విద్యావిభాగంలో పీహెచ్‌డీ



రామలక్షుమ్మ

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఓంశాంతినగర్ కాలనీలో నివాసం ఉండే భూమిరెడ్డి రామలక్షుమ్మ విద్యావిభాగంలో డాక్టరేట్ పీహెచ్‌డీ పట్టా పొందింది. వీరపునాయునిపల్లె మండలంలోని గడ్డంవారిపల్లె గ్రామానికి చెందిన ఈ ఆమె పద్మావతి మహిళ యూనివర్శిటిలో విద్యావిభాగంలో ప్రొఫెసర్ పి.రేణుక ఆధ్వర్యంలో ఉద్యోగ సంతృప్తి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల పరిశోధన అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసింది.


చెత్త తొలగింపు



మురికి కాలువలను శుభ్రపరుస్తున్న కార్మికులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు, విశ్వప్రకృతి నగర్, భగత్‌సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీ కాలువల్లో చెత్త, కలుపు మొక్కలను బుధవారం తొలగించారు. స్థానిక 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి అంకమ్మ, శ్రీనివాసులరెడ్డి కార్మికులను పిలిపించి కాలువలను శుభ్రం చేయించారు.

ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ ఆకస్మిక మృతి



విజయ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

పులివెందుల : స్థానిక జయమ్మ కాలనీకి చెందిన కానాల విజయ్‌కుమార్‌రెడ్డి(36) ఆకస్మికంగా మృతి చెందారు. ఛాతిలో నొప్పి రావడంతో పులివెందులలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లామని, మూడు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు మృతుడి కుటుంబీకులు వెల్లడించారు. ప్రస్తుతం విజయ్‌కుమార్‌రెడ్డి సత్యసాయి జిల్లా కదిరిలోని స్టేట్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మృతుడికి భార్య గౌతమి, కుమారుడు, 10నెలల పాప ఉన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సంఘం అమరావతి సర్కిల్ డి.చంద్రమోహన్(డీఆర్‌ఎస్), రీజనల్ సెక్రటరీ టి.వేణుగోపాల్, నాయకులు, పలు బ్యాంకుల సిబ్బంది నివాళులర్పించారు.

ఎరువు.. ధరల దరువు

- భగ్గుమంటున్న ఎరువుల ధరలు
- రైతుల నడ్డివిరుస్తున్న కూటమి ప్రభుత్వం
- ఏడాదిన్నర కాలంలో పలుమార్లు పెరిగిన ఎరువుల ధరలు
- ఆందోళనలో ఉద్యాన రైతులు

పెరిగిన ఎరువుల ధరలు

ఎరువుల రకం	పాత ధర (రూపాయల్లో)	కొత్త ధర (రూపాయల్లో)
15-15-15-15-9	1,450	1,600
12-32-16 (ఇఫ్కో)	1,470	1,720
15-20-0-13	1,250	1,300
16-16-16	1,450	1,600
పొటాష్	1,535	1,800
20-20-0-13 (ప్యాక్ట్)	1,300	1,425
20-20-0-13 (గ్రోమోర్)	1,300	1,350
20-20-0-13 (ఐపీఎల్)	1,300	1,400
16-20-0-13	1,260	1,300
24-24-0 (మహాధన్)	1,700	1,800
14-35-14 (గ్రోమోర్)	1,700	1,800
సూపర్ పాస్ఫేట్	580	640
20-20-0-13 (మహాధన్)	1,350	1,450



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎరువులు

సింహాద్రిపురం : కూటమి ప్రభుత్వంలో ఎరువుల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో పంటలు సాగు చేసే రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పెట్టుబడి సాయం, పంట నష్ట పరిహారం, రైతుల బీమాను పట్టించుకోని ప్రభుత్వం పెరుగుతున్న ఎరువుల ధరలను నియంత్రించలేక మరోసారి రైతుల నడ్డి విరుస్తోంది. డిమాండ్ మేరకు యురియా దొరకకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాలలో ఖరీఫ్ వర్షాధార పంటలపై ఆశలు వదులుకున్న అనేకమంది రైతులు నీటి ఆధారిత వాణిజ్య పంటలైన మొక్కజొన్న, అరటి, బొప్పాయి, దానిమ్మ, చీనీ, తదితర పంటల సాగు కోసం రైతులు ఆసక్తి చూపుతున్నారు. సింహాద్రిపురంలో 18 వేల ఎకరాలలో చీనీ, 3 వేల ఎకరాలలో అరటి, బొప్పాయి, దానిమ్మ 20 ఎకరాల చొప్పున, నిమ్మ, జామ, అల్లనేరేడు 10 ఎకరాల చొప్పున పంటలను సాగు చేశారు. ఎరువుల కొనుగోలు కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ఎరువుల ధరలు నియంత్రించాల్సిన ప్రభుత్వం ధరలు పెరుగుతున్నా పట్టించుకోకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిలకడగా ధరలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాం (2019–24)లో ఎరువుల ధరలు నిలకడగా ఉన్నాయి. ఎరువుల ధర పెంచిన సందర్భాలు లేవు. వ్యాపారుల నుంచి రైతులను కాపాడేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వంలో పలుమార్లు ఎరువుల ధరలు పెరగడంతో మరోసారి ఎక్కడ ధరలు పెంచుతుందోనన్న భయంతో బడా రైతులు వివిధ మార్గాల ద్వారా పెద్ద ఎత్తున స్టాకు పెట్టుకుంటున్నారు. వీరి స్టాకుతోపాటు రైతులకు కావాల్సిన ఎరువుల కొరత ఉండటంతో చిన్నాచితక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎరువుల ధరలను తగ్గించాలి



ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలి. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం రైతుల గోడును ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. పెరిగిన ఎరువుల ధరలవల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఎక్కువగా వ్యవసాయంలో దిగుబడి బాగా తీయాలంటే డ్రిప్ మందులు అవసరం వాటిని కూడా సబ్సిడీతో అందించాలి.

– సి.బి.కిశోర్‌రెడ్డి, రైతు, హిమకుంట్ల

యురియా కొరత తీర్చాలి



ఎకరాల్లో అరటి, బొప్పాయి, చీని పంటలు సాగు చేస్తున్నా. అరటి సాగు కోసం లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెడుతున్నా. పంట చేతికొచ్చి దిగుబడి రావాలంటే ఎరువులను వేయాలి. పంటకు అవసరమైన యురియా దొరకడం లేదు. యూరియ ధరల పెరుగుదలతో పెట్టుబడి పెరిగిపోతోంది.

– రామాంజుల్‌రెడ్డి, రైతు, సింహాద్రిపురం

ఇ-పంట నమోదు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



అచ్చివెళ్లిలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి

కమలాపురం : పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పని సరిగా తమ పంటలకు ఇ-పంట నమోదు చేసుకోవాలని ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని గంగవరం, విభరాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె శాస్త్రవేత్తలు హేమలత, లీలావతి, మాధురిలతో కలసి పర్యటించారు. క్షేత్రస్థాయిలో మినుము, పెసర పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు అందజేసి మాట్లాడారు. రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడాలన్నారు. అలాగే ప్రతి రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ఇ-పంట నమోదు చేసుకోని రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. బుధవారం పార్నపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులతో కలిసి వరి పంటను పరిశీలించి ఆకుముడత పురుగు ఉన్నట్లు గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్ర సిబ్బంది పవన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. అచ్చివెళ్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంట నమోదుకు ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించారని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే జిప్సం, పనిముట్లు కావాలని రైతులు తెలియజేస్తే సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రమణారెడ్డి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు యూరియాను అందించాలని వినతి



డీటీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి

వల్లూరు : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరికీ అవసరమైన యూరియాను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం వల్లూరు మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యంగా కురిసినప్పటికీ కేసీ కెనాల్ పరిధిలోని ఆయకట్టు భూమితో పాటు, ఇతర ప్రాంతాల్లో బోరు బావులు కింద రైతులు పెద్ద ఎత్తున వరి పంటను సాగు చేశారన్నారు. అనేక కష్ట నష్టాలకు ఓర్చి ఎన్నో ఆశలతో వరి పంటను సాగు చేసిన రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యాపారుల దగ్గర కూడా తగినంత యూరియా లేదని, ఒక వేళ వున్నా ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని అనడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అవసరమైన రైతులకు తగినంత యూరియాను సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెలకువలను పాటిస్తే అధిక దిగుబడులు



సావిశెట్టిపల్లెలో ఉల్లి పంటను పరిశీలిస్తున్న రవిచంద్రబాబు

కాశినాయన : ఉల్లి పంటలో మెలకువలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు అన్నారు. మండలంలోని సావిశెట్టిపల్లెలో రైతులు సాగు చేసిన ఉల్లి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 14వేల ఎకరాల్లో రైతులు ఉల్లి పంట సాగు చేస్తున్నారన్నారు. ఎగుమతి ఆధారిత కేపీ ఉల్లితోపాటు పెద్ద బళ్లారి, చిన్న బళ్లారి రకాలు సాగులో ఉన్నాయన్నారు. పంట సాగు చేసే సమయంలో విత్తన ఎంపిక ప్రధానమైందని, సంకర జాతి రకాలను ఎన్నుకుని బిందు సేద్యం ద్వారా సాగుచేస్తే అధిక దిగుబడితో పాటు గడ్డ నాణ్యత పెరుగుతుందన్నారు. రైతులు పొలాల్లోనే పంటను అమ్ముకుని ఆర్థికంగా నష్టపోవడం జరుగుతోందని, రైతులు గోదాములు నిర్మించుకుంటే ఉద్యాన శాఖ 50 శాతం రాయితీ అందిస్తోందన్నారు. యూనిట్ ధర రూ.లక్షా 75 వేలు కాగా, రైతు వాటా రూ.87,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో గోదాములో 25 టన్నుల ఉల్లిని నిల్వ ఉంచు కోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి శ్రీనివాసులురెడ్డి, సురేందర్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు చంద్రశేఖర్, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

నేడు మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికల ప్రదర్శన

జమ్మలమడుగు : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా 4వ తేదీ గురువారం మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన తలనీలాల మొదలు కొని పాదుకాల వరకు వివిధ రకాల వస్తువుల ప్రదర్శన నిర్వహిస్తారని ఆస్థానయే గౌసియా అధిపతి సయ్యద్‌షా గౌస్ పీరాఖాద్రీ, తనయుడు తాహీర్‌పీరా ఖాద్రీలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మించి 1500 సంవత్సరాలైనందున ఈ ఏడాది గౌసియా ఆస్థానంలో ప్రత్యేక ఏర్పాటు చేసి హైదరాబాద్ నుంచి మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన 20 రకాలైన వస్తువులు, పరికరాలను ప్రదర్శనకు ఉంచనున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. ఇలాంటి ప్రదర్శన ఎప్పుడు జరుగలేదని ఈ అవకాశాన్ని ప్రతి ముస్లిం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభి ట్రస్ట్‌కు బాడీ ఫ్రీజర్ వితరణ



ట్రస్ట్ చైర్మన్‌కు ఫ్రీజర్ వితరణ చేస్తున్న దాతలు

కమలాపురం : అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.విజయ్‌బాబుకు కర్నాటి సోదరులు బాడీ ఫ్రీజర్ వితరణ చేశారు. బుధవారం పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెకు చెందిన కర్నాటి సుబ్బారెడ్డి, మనెమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు చంద్రశేఖర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి దంపతులు ట్రస్ట్‌కు ఫ్రీజర్ వితరణ చేశారు. అభి ట్రస్ట్ చేస్తున్న సేవలను గుర్తించి ఫ్రీజర్ అందజేశామని దాతలు వివరించారు. ఫ్రీజర్ అవసరమైన వారు 99637 53987, 93983 69016 నెంబర్లకు సంప్రదించాలని ట్రస్ట్ చైర్మన్ తెలిపారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ముద్దనూరు : ఎన్నికల ముందు అన్ని ప్రధాన పార్టీలు బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు సాకే రాధాకృష్ణ, బాబయ్య, శ్రీనివాసులు కోరారు. బుధవారం నిర్వహించిన బీసీ మండల సమావేశంలో వారు మాట్లాడారు. జనాభాలో బీసీల సంఖ్య అధికంగా వున్నప్పటికీ బీసీలకు రాజకీయాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యతలేదని, ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని, బీసీలకు తగ్గట్లుగా రిజర్వేషన్ కల్పించాలని, మండలానికొకటి బీసీ కమ్యూనిటీ భవనం నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సతీష్‌కుమార్

పులివెందుల రూరల్ : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొద్దీన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక మినీ సచివాలయంలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రతి రోజు మీకు కేటాయించిన గృహాలలో ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించాలని, ఎవరికైనా జ్వరం ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్ష చేయాలన్నారు. అనారోగ్యంతో ఎవరైనా బాధపడుతుంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి మాత్రమే వెళ్లాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో దోమల ఉధృతి అధికంగా ఉంటుందని, నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కాంతికుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఆరోగ్య విస్తరణాధికారి సతీష్ కుమార్, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందించండి

- తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోండి
- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీపీలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటబయపురెడ్డి

వేముల : మండల వ్యాప్తంగా అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి ప్రభుత్వ పథకాలు మంజూరైనప్పుడు అర్హులుగా ఉన్న రైతులను గుర్తించి పథకాలు అందించడం ద్వారా అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా అందే సబ్సిడీ విత్తనాలు కానీ, ఉచితంగా అందించే మినీ కిట్స్ పంపిణీలో అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అలాగే మండల వ్యాప్తంగా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య ఉన్నట్లయితే జెడ్పీ నిధులను మంజూరు చేయించి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. పంచాయతీలలో రోడ్లపై మురికినీరు ప్రవహించకుండా చూడాలన్నారు. వీధులలో మురికి నీరు నిల్వ ఉంటే రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేముల వ్యవసాయ కార్యాలయ ఆవరణలో మండల పరిషత నిధులతో చదును చేయిస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి పైపులైన్ నిర్మాణానికి జెడ్పీ నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏపీఎం ఆంజనేయులు వెలుగు ద్వారా అమలవుతున్న మండల సమావేశంలో వివరించారు. అలాగే అన్ని శాఖల పనితీరుపై మండల సమావేశంలో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏఓ ఓబులేసు, వైద్యాధికారి శరణ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌రెడ్డి, పీఆర్ ఏఈ అబ్దుల్లా, మండల ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, లీలావతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిలాద్ ఉన్ నబీ వేడుకలు



కమలాపురంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా

కమలాపురం : దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతి గాంచిన కమలాపురంలోని దర్గా-ఏ-గఫారియాలో ఈనెల 4వ తేదీన సాయంత్రం మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమలాపురంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్గా-ఏ-గఫారియాలో ప్రతి ఏటా ఆసారే షరీఫ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆసారే షరీఫ్ అంటే వందల ఏళ్ల క్రితం మహ్మద్ ప్రవక్త, ఆయన కుటుంబ సభ్యులు వాడిన 100కు పైగా వస్తువులను ప్రదర్శిస్తారన్నారు. ఈ వస్తువులను మక్కా, మదీన, బాగ్దాద్, ఈజిప్ట్, తుర్కి తదితర దేశాల నుంచి తెప్పించినట్లు ఆయన వివరించారు. ఈ వస్తువులను నేరుగా చూస్తే వారి కోరికలు నెరవేరుతాయన్నారు. అలాగే వారికి ఆయురారోగ్యాలు, సంతానం, ఉద్యోగాలు పొందుతారని భక్తులు విశ్వసిస్తారన్నారు. అదే రోజు రాత్రి భారీ ఎత్తున అన్నదానం, అనంతరం బయాన్ ఉంటుందన్నారు. 5వ తేదీన ఉదయం జెండా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం మిలాద్ ఉన్ నబీ ప్రత్యేక దువా జరుగుతుందని, భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖంమీద మచ్చలు, చర్మంపై టి.బి.మచ్చలు, కుష్ఠు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కంటి చూపు లేకపోతే జీవితం అంధకారమే



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వేంపల్లె : కంటి చూపు లేకపోతే జీవితం అంధకారమేనని, కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆఫ్తాల్మిక్ అధికారి రెడ్డెన్న తెలిపారు. బుధవారం తాళ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ ఉర్దూ గురుకుల పాఠశాలల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. 31 మందికి కంటి లోపం ఉన్నట్లు తెలిపారు. వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కంటిని అజాగ్రత్తగా చూసుకుంటే ఇబ్బందులు పడతారని, కాబట్టి ప్రతి ఒక్కరూ కంటిని జాగ్రత్తగా కాపాడుకుంటే అంధకారమనేది ఉండదన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లె పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ నిహారిక, శాంతి, సీహెచ్ఓలు వెంకటరత్నం, ఫయాజ్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా బేగం, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుగుణమ్మ, స్టాఫ్ నర్సు అరుణ, సూపర్ వైజర్ అంకయ్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరకే యూరియా విక్రయించాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీచేస్తున్న విజిలెన్స్ అధికారులు

ముద్దనూరు : ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.266.50లకే యూరియా బస్తాను విక్రయించాలని, రైతులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ ఎం.శివన్న, ఎఫ్ఆర్వో మురళికృష్ణలు హెచ్చరించారు. బుధవారం మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో కలిసి వారు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. యూరియా అమ్మేసమయంలో ఎరువులతో ముడిపెట్టకుండా విక్రయించాలని, డీబీటీ మిషన్ ద్వారానే విక్రయించాలని, ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్ నమోదుచేయాలని సూచించారు. ఏవో మాట్లాడుతూ కాలంచెల్లిన ఉత్పత్తులు నిల్వవుంచరాదని, అనుమతి వున్న వాటినే విక్రయించాలన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి



అర్బన్ సీఐగా బాధ్యతలు చేపడుతున్న సీతారామిరెడ్డి

పులివెందుల రూరల్ : అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అర్బన్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అర్బన్ సీఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఇక్కడ పనిచేస్తున్న సీఐ చాంద్‌బాషా బదిలీ కావడంతో ఆయన స్థానంలో కడప రిమ్స్‌లో పనిచేస్తున్న సీతారామిరెడ్డి బదిలీపై పులివెందులకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎవరూ కూడా ఫ్యాక్షన్ గొడవలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.